క్లుప్తంగా

'బుగ్గ' హుండీ ఆదాయం రూ.1.30 లక్షలు



హుండీలో నగదును లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: హుండీ కానుకల లెక్కింపు ద్వారా బుగ్గ సంగమేశ్వర ఆలయానికి రూ.1.30 లక్షలు ఆదాయం లభించినట్లు ఈఓ క్రిష్ణయ్య తెలిపారు. సోమవారం ఆలయంలో భక్తులు స్వామివారికి సమర్పించిన హుండీ కానుకలను లెక్కించారు. హుండీలో కానుకల లెక్కింపు ద్వారా రూ.1,30,697 ఆదాయం రాగా, అన్నదానం హుండీ ద్వారా రూ.11,396 వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

రామస్వామి ఆలయ సందర్శన



పురావస్తు శాఖ అధికారికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

గుత్తి: కోట వీధిలో ఉన్న అతి పురాతనమైన శ్రీరామస్వామి ఆలయాన్ని సోమవారం జిల్లా పురావస్తు శాఖ అధికారి (సీనియర్ కన్జర్వేటివ్ అసిస్టెంట్) రాజా యోగేష్ సందర్శించారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, పూజారులు, పురావస్తుశాఖ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ సందర్శన అనంతరం ఆయన కోటలోని చారిత్రక ప్రదేశాలను పరిశీలించారు. పర్యాటకుల కొరకు నిర్మిస్తున్న టాయిలెట్లు, ఆర్‌ఓ ప్లాంట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పురావస్తు సిబ్బంది శైలేంద్రకుమార్‌రెడ్డి, షారూన్, ఆంజనేయులు, అమృత్ నరసింహ, పర్వీన్ బేగం కోట సంరక్షణ యువజన నాయకులు జిలాన్, శివ, బాలు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ధ్వంసం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పాతకోటలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేసిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. పాత కోటకు చెందిన రసూల్ ఇంటి ఆవరణలో ఉన్న ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శబ్దాలకు బయటకు వచ్చిన రసూల్ కేకలు వేయడంతో వారు పారిపోయారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పండ్ల మొక్కల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

పెద్దవడుగూరు: పండ్ల మొక్కలు నాటడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని ఎస్‌ఐ ఆంజనేయులు, ఏపీఓ పుల్లారెడ్డి సూచించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉపాధి పథకంలో భాగంగా 100 పండ్ల మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ ఉద్యాన వనంలో ఇప్పటికే చాలా వరకూ పండ్ల మొక్కలు పెంచుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద పండ్ల మొక్కలు నాటుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన 250 బస్తాల రేషన్ బియ్యాన్ని సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. పక్కా సమాచారంతో ఎస్‌ఐ సురేష్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 250 బస్తాలు, మూడు ఆటోలను గుత్తి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అలాగే ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

వైభవంగా 'కార్తీక' ముగింపు ఉత్సవం



గరుడవాహనంపై స్వామి ప్రతిమలను ఊరేగిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో సోమవారం కార్తీక మాసం ముగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవస్వామి ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా పోలి పాడ్యమి పూజలు



కాశీ విశ్వేశ్వరాయంలో అభిషేకం చేస్తున్న దృశ్యం

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని శివాలయాల్లో సోమవారం పోలి పాడ్యమి (చాలా మంచి శుభ దినం) పురష్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాశీ విశ్వేశ్వర దేవాలయం, నగరేశ్వరాలయం, నాగలింగేశ్వరాలయం, అయ్యప్ప ఆలయం, గౌతమేశ్వరాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఊరూరా బెల్ట్ జోరు



కూటమి సర్కారు కొలువయ్యాక పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. లైసెన్స్‌డ్ దుకాణాల్లోనే కాకుండా ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు చేసిన బెల్టుషాపుల్లో విచ్చలవిడిగా మద్యం లభిస్తోంది. దీంతో మందుబాబులు నిత్యం మత్తులో జోగుతూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ఎమ్మార్పీకి మించి అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు.

- పల్లెల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు
- ఇబ్బందులు పడుతున్న మహిళలు
- కన్నెత్తి చూడని ఎక్సైజ్ అధికారులు, పోలీసులు



గార్లదిన్నె: గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. శింగనమల నియోజకవర్గంలోరి గార్లదిన్నె, శింగనమల, పుట్లూరు, యల్లనూరు, నార్పల,బుక్కరాయసముద్రం మండలాల్లో ప్రతి మద్యం షాపు పరిధిలో గ్రామాల్లో మూడు నుంచి నాలుగు బెల్టు షాపులు కొనసాగుతున్నాయంటూ సర్వత్రా చర్చ కొనసాగుతోంది. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించడానికి వీల్లేదు. బెల్టు షాపులు పెడితే బెల్ట్ తీస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరిక జారీ చేసినా.. కూటమి నాయకులు బేఖాతరు చేస్తున్నారు. మద్యం షాపు నిర్వాహకులు ఒక్కో బెల్టు షాపునకు రూ.30 వేల నుంచి రూ.50 వేలు తీసుకుని మద్యం సరఫరా చేస్తుండడంతో గ్రామాల్లో అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. అధిక రేట్లకు మద్యం అమ్మకాలు జరుగుతున్నా సంబధిత ఎక్సైజ్ శాఖ పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం బాటిల్‌పై అదనంగా వసూలు చేస్తున్నట్లు మందు బాబులు వాపోతున్నారు. బెల్టు షాపు నిర్వాహకులు ఎక్సైజ్ అధికారులకు నెలవారీ మామూళ్లు ఇస్తుండడంతోనే అటువైపు కన్నెత్తి చూడలేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.

శింగనమల నియోజకవర్గంలో మద్యం దుకాణాలు ఇలా..	
శింగనమల	3
గార్లదిన్నె	4
బుక్కరాయసముద్రం	4
నార్పల	4
యల్లనూరు	1
పుట్లూరు	2

18 దుకాణాలకు అనుమతి

శింగనమల నియోజకవర్గంలో మొత్తం 18 మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇవి కాకుండా ఒక్కో గ్రామంలో మూడు చొప్పున బెల్టు షాపులు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా అనధికారికంగా 100కు పైగా బెల్టుషాపులు ఉండడం విశేషం. ప్రతి మద్యం షాపు నుంచి స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేకు వాటాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రభుత్వం నూతన మద్యం షాపులు ఏర్పాటు చేసినప్పటి నుంచి గ్రామాల్లో బెల్టుషాపులు ఏర్పాటుకు పెద్దఎత్తున హడావుడి చేశారు. మద్యం షాపు లాటరీలో దక్కించుకునేందుకు టీడీపీలోనే పలువురు నాయకులు పోటీ పోటీ పడ్డారు. మద్యం షాపు దక్కించుకున్న వారు సిండికేట్ అయి ఆయా మద్యం షాపు పరిధిలో రహస్యంగా బెల్టుషాపులు నడిపిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ, పోలీసులు స్పందించి బెల్టు షాపులపై దాడులు నిర్వహించి అక్రమ మద్యం విక్రయాలు అరికట్టాలని నియోజకవర్గం ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్న మహిళలు

గ్రామాల్లో మద్యం దుకాణాలు మందు బాబులకు అడ్డాగా మారాయి. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోనే బెల్టు షాపు ఉండడంతో తాగిన మద్యం సీసాలు ఇళ్ల పరిసర ప్రాంతాల్లోనే వదేస్తున్నారు. మందు బాబులు మద్యం సేవించి అరుపులు, కేకలతో విసిగెత్తి పోతున్నామని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా గ్రామాల్లో బెల్టు షాపుల్లో ఒక క్వాటర్ బాటిల్ పై రూ.20 నుంచి రూ.50 అదనంగా విక్రయిస్తున్న పరిస్థితి నెలకొంది. బెల్టుషాపులపై ఎక్సైజ్ అధికారులు, స్థానిక పోలీసులు నామమాత్రపు దాడులతో సరిపెడుతున్నట్లు తెలుస్తోంది. మద్యం షాపుల నిర్వాహణలో ప్రజా ప్రతినిధుల పెత్తనం ఉండడంతో ఎక్సైజ్ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

బెల్టు షాపులతో యువత తప్పదారి



గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించడం వల్ల యువత మద్యానికి బానిసై తప్పుదారి పట్టే అవకాశం ఉంది. పాఠశాలలు, దేవాలయాల సమీపంలో మద్యం విక్రయిస్తున్నారు. బెల్టుషాపుల కట్టడి చేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో బెల్టుషాపుల్లో మద్యం అమ్మకాలను కట్టడి చేయడంలో ఎక్సైజ్ శాఖ పూర్తి విఫలమవుతోంది.

– అక్కుర్, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి

పట్టుబడితే కఠిన చర్యలు



గ్రామాల్లో ఎవరైనా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. బెల్టు షాపు నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవు. అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తే కేసులు నమోదు చేస్తాం. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహణపై ప్రత్యేక నిఘా ఉంచాం. పట్టుబడితే ఎంతటివారైనా సరే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

– గౌస్ మహమ్మద్ బాషా, ఎస్‌ఐ , గార్లదిన్నె

పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి



మార్కెట్ యార్డు కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తాడిపత్రి అర్బన్: స్థానిక తాడిపత్రి మార్కెట్‌యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక మార్కెట్ యార్డు వద్ద పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం నాయకులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా రైతు సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పత్తికి మద్దతు ధర రూ.7,520, అదనంగా బోనస్ రూ.2,475 కలిపి 100 కేజీలకు రూ.10 వేల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాడిపత్రి మండలంలో చాలా గ్రామాల్లో పత్తిని సాగు చేశారని, సకాలంలో వర్షాలు కురవకపోవడం వల్ల దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందన్నారు. రాష్ట్రప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మార్కెట్‌యార్డు సెక్రటరీకి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి రాజారామిరెడ్డి, నాయకులు చెన్నారెడ్డి, వెంకటరమేష్, రఘువీరా, రాజేశ్వర్‌నాయుడు, శిరీష, నాగార్జున, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస రామానుజన్ ఇంటెలిజెన్సీ టెస్ట్



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఇంటర్ విద్యార్థులకు శ్రీనివాస రామానుజన్ ఇంటెలిజెన్సీ టెస్ట్ నిర్వహించారు. కరెస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ఏటా ఇంటెలిజెన్సీ టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. పరీక్ష రాయడానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇంటర్ ఎంపీసీ చదువుతున్న 2,200 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. డిసెంబర్ 22న శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా విజేతలకు మొదటి బహుమతిగా ల్యాప్‌టాప్, ద్వితీయ బహుమతిగా ట్యాబ్, తృతీయ బహుమతిగా మొబైల్ ఫోన్, మరిన్ని ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, హెచ్‌అండ్‌ఎస్ విభాగం అధిపతి డాక్టర్ గురుసిద్దప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులకు వినతుల వెల్లువ

గుంతకల్లుటౌన్: పట్టణ శివార్లోని జగ్జీవన్‌రామ్, భీమిరెడ్డి, గుజిరి, తదితర కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలను తదితర కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయించాలని మున్సిపల్ కమీషనర్ నయీమ్ అహ్మద్‌ను సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు కోరారు. సోమవారం ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్, కాలనీవాసులు కమిషనర్‌ను కలిసి ఆయా కాలనీల్లోని సమస్యలను వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు రఘునాథరెడ్డి, జిలాన్, బాష, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు: జీబీసీ కాలవ నుంచి బీమ్‌రెడ్డి కాలనీ వరకు సీసీ రోడ్డు వేయాలని కమిషనర్ నయిమ్ అహమ్మద్‌కు విన్నవించారు. సోమవారం వివిధ ఎస్సీ, ఎస్టీ కుల సంఘాల నాయకులతో కలిసి కాలనీ వాసులు అందజేశారు. కార్యక్రమంలో ఎం.మహేంద్ర, వై.బీమలింగ, కోరి చంద్రశేఖర్, రామాంజినేయులు, నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు షేక్ అలంనవాజ్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: గుత్తి ఆర్‌ఎస్‌లోని 7వ వార్డు అంబేడ్కర్ కాలనీలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ ఓబులేసుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు ప్రసాద్, పి.నాగరాజు, రంగడు పాల్గొన్నారు.

శింగనమల: మండలంలోని అన్ని గ్రామాల్లో కూలీలకు పనులు లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లుతూ ప్రమాదాలకు గురవుతున్నారని, గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టాలని సీపీఎం నాయకులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నియోజకవర్గ సమితి నాయకుడు భాస్కర్, నాయకులు శ్రీనివాసులు, వెంకటరాముడు, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



తాడిపత్రి ట్రాన్స్‌కో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



పెద్దవడుగూరులో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

తాడిపత్రి అర్బన్/పెద్దవడుగూరు: ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రంగయ్య డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు, వ్యవసాయ విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయడంపై సోమవారం తాడిపత్రిలోని ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు వ్యవసాయానికి విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయమని, విద్యుత్ చార్జీలు పెంచమని కల్లబొల్లి మాటలు చెప్పి అధికారం దక్కించుకున్న కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ నిర్ణయాలను వెనక్కు తీసుకోకపోతే సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు ఓబులేసు, గోపాల్, సూరి, రాములమ్మ, సాలమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. అలాగే విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల అమర్చే ప్రక్రియను ఆపివేయాలని పెద్దవడుగూరులో సీపీఐ సీనియర్ నాయకులు సూర్యానారాయణరెడ్డి, మండల కార్యదర్శి వెంకటరాముడుయాదవ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సీపీఐ నాయకులు పోలా రంగస్వామి, సుధాకర్‌గౌడ్, ఏఐటియుసీ నాయకులు ఉసేన్‌పీరా, ఆదినారాయణ, నారాయణస్వామి, కిషోర్, ఆది ,రంగడు, ఓం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌లాక్ వినియోగంతో చోరీల కట్టడి



స్మార్ట్ లాక్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సీఐ మనోహర్

గుంతకల్లుటౌన్: ఇళ్లు, దుకాణాల్లో చోరీలు, దోపిడీలను అరికట్టడంతో పాటు నేర నియంత్రణకు స్మార్ట్ లాక్‌లు ఎంతగానో ఉపయోగపడుతాయని వన్‌టౌన్ సీఐ బి.మనోహర్ సూచించారు. సోమవారం సాయంత్రం వన్‌టౌన్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్మార్ట్ (అలారమ్) లాక్ పనితీరు, వినియోగంపై వ్యాపార్లులకు అవగాహన కల్పించారు. ఊర్లెళ్లేటప్పుడు స్మార్ట్‌లాక్‌ను వేసినట్లయితే దొంగలెవరైనా ఆ లాక్‌ను టచ్ చేసినా, పగులగొట్టాలని చూసినా వెంటనే సైరన్ మోగుతుందన్నారు. తద్వార దొంగలు చోరీ ప్రయత్నాన్ని విరమించుకోవడంతో పాటు సైరన్ శబ్ధానికి ఇరుగుపొరుగున వారు అప్రమత్తమవుతారన్నారు. స్మార్ట్‌లాక్‌లను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అందుబాటులో ఉంచామని, ఒక్కో లాక్ ధర రూ.450 మాత్రమేనన్నారు. ఫ్లిఫ్‌కార్ట్, అమెజాన్ తదితర యాప్‌ల ద్వారా కూడా వీటిని కొనుగోలు చేసుకోవచ్చన్నారు. ప్రజలు, వ్యాపారస్థులు, ప్రార్థనా మందిరాల నిర్వాహకులు స్మార్ట్ అలారమ్ లాక్‌లను వినియోగించి చోరీలను అరికట్టేందుకు పాటుపడాలని సీఐ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కొండయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దొంగలను పట్టుకుంటాం

యాడికి: కేబుల్, ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగలను పట్టుకుంటామని సీఐ ఈరన్న రైతులతో తెలిపారు. సోమవారం రాత్రి సీఐ ఈరన్న తన సిబ్బందితో కలసి దైవాలమడుగు, చందన గ్రామాల్లోని తోటల వద్ద గస్తీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఇటీవల గ్రామాల్లో రైతుల తోటలు టార్గెట్ చేస్తూ బోరుబావుల వద్ద కేబుల్‌తోపాటు, ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి, ఆయిల్ చోరీ చేస్తున్నారన్నారు. స్పెషల్ టీంను ఏర్పాటు చేసి ఆయా గ్రామాల్లో గస్తీ ముమ్మరంగా చేపట్టామని సీఐ తెలిపారు. త్వరలో దొంగలను పట్టుకుంటామన్నారు.

షిరిడీ సాయి ఆలయ కమిటీ ఎన్నిక

గుత్తి: పట్టణంలోని షిరిడీ సాయి బాబా ఆలయంలో సోమవారం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా జేకే రాము రాయల్, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ రెడ్డి, మహేష్, ప్రధాన కార్యదర్శిగా కోనా ప్రదీప్‌రెడ్డి, కోశాధికారిగా నారాయణ స్వామి, సహాయ కోశాధికారిగా రూపేష్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా నరేంద్ర రెడ్డి, శ్రీనివాసులు, మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. అధ్యక్షుడు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుల అరెస్ట్

పెద్దపప్పూరు: మండలంలోని సింగనగుట్టపల్లిలో గత నెల 22న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సునీత కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఘటన జరిగిన రోజు సునీత సోదరుడు నారాయణ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో సునీతకు వరుసకు మరది అయిన చిన్న వీరయ్య, ఆయన భార్య పద్మావతి ప్రవర్తనపై అనుమానాలు వ్యక్తం కావడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. కుటుంబ కలహాల నేపథ్యంలో 22న సునీతను పొలం వద్ద గొంతు నులిమి హతమార్చామని, ఆ తర్వాత మృతదేహం పక్కన పురుగుల మందు డబ్బా పడేసినట్లుగా నిందితులు అంగీకరించారు. చిన్న వీరయ్య, పద్మావతి దంపతులను సీఐ రామసుబ్బయ్య సోమవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

యల్లనూరు: మండలంలోని పాతపల్లి సమీపంలో సోమవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు పుట్లూరు సీఐ సత్యబాబు తెలిపారు. జూదరుల నుంచి ఏడు ద్విచక్ర వాహనాలు, రూ.4,040 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వైకల్యాన్ని జయించాడు!

సందర్భం: నేడు దివ్యాంగుల దినోత్సవం

- టీ స్టాల్ నిర్వహణతో జీవనం
- ఆదర్శంగా రంగనాయకులు



చెన్నకేశవ స్వామి దేవాలయం వద్ద టీ స్టాల్ నిర్వహిస్తున్న రంగనాయకులు



ముగ్గురు కూతుళ్లతో రంగనాయకులు, జ్యోతి

యాడికి: అన్నీ ఉన్నా లక్ష్యం సాధికంచలేక మధన పడుతున్న యువకులు ఎంతోమందిని చూశాం. కానీ పోలియోతో రెండు కాళ్లు సచ్చుబడిన ఓ వ్యక్తి టీ కొట్టు నడుపుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. వివరాలు.. మండల కేంద్రంలో మంగళ బాలన్న, లక్ష్మీదేవి దంపతులకు ఐదుగురు కుమారులు. పెద్ద కుమారుడు రంగనాయకులుకు ఆరేళ్ల వయస్సులో పోలియో మరమ్మారి సోకడంతో రెండు కాళ్లు చచ్చుబడి పోయాయి. 2002లో పదో తరగతి పూర్తి చేశాడు. 2007లో దూరపు బంధువు, గుంతకల్లు మండలం నెలకొండ గ్రామానికి చెందిన దివ్యాంగురాలు జ్యోతిని వివాహం చేసుకున్నాడు. ఇద్దరూ దివ్యాంగులైనా అధైర్య పడకుండా మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి దేవాలయం సమీపంలో టీ స్టాల్ కొట్టు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. మండల కేంద్రంలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లోని అధికారులు టీ ఆర్డర్ ఇస్తే వెంటనే తన వాహనంలో పోయి టీ అందిస్తుంటాడు. వారికి ముగ్గురు కూతుళ్లు. పెద్ద కూతురుకు గత ఏడాది వివాహం చేశారు. రెండో కూతురు రక్షిత మండలంలోని కేజీబీవీలో 8వ తరగతి, చిన్న కూతురు హేమమాలిని ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. రంగనాయకులు స్వతహాగా చిరంజీవి వీరాభిమాని కావడంతో అందరూ ఠాగూర్ అని పిలుస్తుంటారు. దివ్యాంగులైన రంగనాయకులు, జ్యోతి దంపతులు ఎవరిపైనా ఆధార పడకుండా ఆదర్శంగా నిలిచారు.

వరి రైతులు అప్రమత్తంగా ఉండాలి

గార్లదిన్నె: వరి పంట సాగు చేసిన రైతులు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఓ సోమశేఖర్ సూచించారు. సోమవారం ఏఓ మాట్లాడుతూ రాబోయే మూడు రోజుల్లో భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉందని, వరి రైతులంతా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

'ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి'

గుంతకల్లు: గుత్తి మండలం గొల్లలదొడ్డి సమీపంలోని సేవాఘడ్ గిరిజన పాఠశాలల్లోని కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారించాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్ నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు.

అర్జీలపై అలసత్వం వద్దు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శ్రావణి

యల్లనూరు: ప్రజలు ఇచ్చిన అర్జీలపై అలసత్వం వీడాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక- ప్రజా దర్బార్‌ను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే అర్జీలను తీసుకొని ఆయా శాఖల అధికారులకు అప్పగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్జీలపై నిర్లక్ష్యం చేయకుండా ఆయా శాఖల అధికారులు త్వరగతిన పరిష్కరించాలన్నారు. ఇన్‌చార్జ్ తహసీల్దారు రాజా, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఏఓ రామకృష్ణుడు, పీఆర్ జేఈ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎద్దు కంటికి శస్త్ర చికిత్స

శింగనమల/గార్లదిన్నె: గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన రైతు బొజ్జప్ప ఎద్దుకు కంటిలో ట్యూమర్ గడ్డ పుట్టడంతో.. సోమవారం ఎద్దు కంటికి వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. ఎద్దు కంటికి ట్యూమర్ గడ్డ ఉందని గుర్తించిన గార్లదిన్నె వెటర్నరీ వైద్యులు డాక్టర్. రమేష్.. శింగనమల వెటర్నరీ సహాయ సంచాలకుడి రెఫర్ చేశారు. సహాయ సంచాలకుడు డాక్టర్ పద్మనాభం ఎద్దు కంటికి శస్త్ర చికిత్స చేసి, ట్యూమర్ గడ్డను తొలగించారు. ఆపరేషన్ అనంతరం ఎద్దుకు యాంటీబయాటిక్స్, అనాల్జిసిక్స్ అందించారు. ఆపరేషన్‌లో వెటర్నరీ సిబ్బంది రాఘవి, కదిరన్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఫిర్యాదు

యాడికి: మండల కేంద్రంలో కొంత మంది కూటమి నేతలు చేస్తున్న అక్రమ రేషన్ బియ్యం రవాణాను అరికట్టాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి జనసేన నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనసేన మండల కన్వీనర్ సునీల్ మాట్లాడుతూ కొంతమంది ప్రజల నుంచి రేషన్ బియ్యం సేకరించి లారీల్లో ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ వాణిజ్య పన్నులు ఎగ్గొడుతూ ప్రభుత్వాన్ని మోసగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జాకీర్, శివ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

యాడికి: మండల కేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న అమీనా ఆప్టికల్స్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేషస్పందన లభించినది. సోమవారం సూఫీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కర్నూల్ శాంతి రామ్ కంటి ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో100 మందికి పరీక్షలు చేశారు. అందులో 20 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని కంటి వైద్య నిపుణుడు చిరంజీవి తెలిపారు. కార్యక్రమంలో అమీనా ఆప్టికల్స్ యజమాని సయ్యద్, సూఫీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అపార్ సమస్యలు పరిష్కరించండి

తాడిపత్రి రూరల్: అపార్ సమస్యలను పరిష్కరించాలని సోమవారం సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ అపార్ పేరుతో స్కూళ్ల యాజమాన్యం విద్యార్థులకు సమస్యలు సృష్టిస్తోందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అధార్‌లో మార్పులు చేర్పుల పేరుతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రజాక్‌వలికి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో వృత్తిదారుల నియోజక వర్గ కార్యదర్శి సాలవేముల సూరి, సహాయ కార్యదర్శి రామాంజినేయులు, ఏఐటీయుసీ నాయకులు ఉమాగౌడ్, రవికుమార్, రత్నయ్య, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.